క్లుప్తంగా

ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం

పొన్నూరు: స్పందనలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల్ని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని పొన్నూరు తహసీల్దార్ కేదార్‌నాథ్ శ్రీకాంత్ తెలిపారు. కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొమ్మిది మంది నుంచి తహసీల్దార్ అర్జీల్ని స్వీకరించారు. సమస్యల్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు ఆయన తెలిపారు.

జూదరుల అరెస్టు

చినకోండ్రుపాడు (ప్రత్తిపాడు): మండలంలోని చినకోండ్రుపాడు శివారుల్లోని ఖాళీ ప్రదేశాల్లో కొంత మంది రహస్యంగా కోత ముక్కాట ఆడుతున్నారన్న సమాచారం సోమవారం ఎస్‌ఐ డి. రవీంద్రబాబుకు అందింది. దీంతో ఆయన సిబ్బందితో కలసి జూద స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.1010 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెదకాకానిలో..

మండలంలోని నంబూరు గ్రామ శివారు పెనుమూలి రోడ్డులోని పొలాల్లో కోత ముక్క ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఇద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 4,450 స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలంగా ఆ ప్రాంతంలో కోత ముక్క ఆట జోరుగా సాగుతోంది. సోమవారం పోలీసుల్ని మార్గంమధ్యలో ఉన్న ఇన్‌ఫార్మర్ గుర్తించి, కోడ్ భాషలో జూదరులకు సమాచారం అందించడంతో పలువురు పరారీ అయినట్లు సమాచారం.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్టు



గుంటూరు రూరల్: వాకింగ్ చేస్తున్న మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. నగర శివారులోని బొంతపాడు గ్రామానికి చెందిన ఓ మహిళ ఒంటరిగా వాకింగ్‌కు వెళ్లింది. అదే సమయంలో ఛత్తీస్‌గఢ్ నుంచి తాపీ పనుల నిమిత్తం వచ్చిన పరదేశికాప సమర్ధార్ ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. మహిళ కేకలు వేయడంతో స్థానికులు అతడ్ని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

శలపాడులో గడ్డి వామి, పూరిల్లు దగ్ధం



శలపాడు(చేబ్రోలు): అగ్ని ప్రమాదంలో పూరిల్లు, గడ్డి వామి దగ్ధమైన ఘటన చేబ్రోలు మండలం శలపాడులో సోమవారం రాత్రి జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు రేగి పులి అంకమ్మస్వామికి చెందిన పూరిల్లు పూర్తిగా కాలి బూడిదైంది. వస్తువులతో పాటు రెండు నీళ్ల ఇంజిన్లు, విలువైన పత్రాలు కాలిపోయాయి. మంటలు సమీపంలోని ఐదు ఎకరాల్లోని గడ్డివామికి అంటుకోవడంతో రూ.లక్షన్నర ఆస్తి నష్టం వాటిల్లింది. అగ్ని ప్రమాదం నుంచి ఆరు మూగ జీవాలు ప్రాణాలతో బయటపడ్డాయి. పూరిపాకలో ఉన్న ఎద్దులు, పశువులను రక్షించడం కోసం యువకుడు యుగంధర్ ధైర్యంతో మంటల సమీప ప్రాంతానికి వెళ్లి కట్టేసిన తాళ్లను తొలగించటంతో ప్రమాదం నుంచి బయటపడ్డాయి. బయటకు తీసుకువచ్చే ప్రయత్నంలో అతడి కాళ్లు, చేతులకు గాయాలవ్వడంతో తెనాలి వైద్యశాలకు తరలించారు. తెనాలి అగ్నిమాపక సిబ్బంది మంటల్ని అదుపు చేశారు.

ఆధ్యాత్మిక చింతనతో పాటు దేశభక్తీ అవసరమే...



గుంటూరు ఈస్ట్: బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన దేవీ భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞం సోమవారంతో ముగిసింది. శ్రీ రాధానంద భారతీస్వామి 70వ జయంతి పురస్కరించుకుని ఎం.వి. సత్యవతి ప్రవచనం చేశారు. సాయంత్రం గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతీస్వామి, నృసింహానంద భారతీస్వామి, శంకరానంద భారతీస్వామిలకు యతి పూజ చేశారు. అనంతరం కమలానంద భారతీస్వామి ప్రవచనం చేశారు. రాధానంద భారతీస్వామి వంటి యతీశ్వరుల్ని స్మరించుకోవడం వల్ల భక్తులందరూ స్ఫూర్తి పొందుతారని తెలిపారు. హిందువులంతా ఆధ్యాత్మిక చింతనతో పాటు, దేశభక్తిని పెంచుకోవాలని, అప్పుడే దేశం అనేక విపత్తుల్ని ఎదుర్కొని సుభిక్షం అవుతుందని ఆయన బోధించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సీహెచ్.మస్తానయ్య, రాధానంద భారతీస్వామి ఆశ్రమ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఒకటే కార్యాలయం.. విధులకు ఆటంకం

- గుంటూరు ఈస్ట్ ఎంఈవో కార్యాలయ ఏర్పాటులో నిర్లక్ష్యం
- ఏడాది కిందట ఈస్ట్, వెస్ట్ కార్యాలయాలుగా విభజించిన ప్రభుత్వం
- గతంలో గుంటూరు రూరల్, అర్బన్‌కు ఒక్కరే ఎంఈవో..
- ప్రస్తుతం ఒకే కార్యాలయంలో నలుగురు అధికారులు
- రెండు నియోజకవర్గాల పరిధిలో పాఠశాలలు, ఉపాధ్యాయుల విభజన
- ఈస్ట్‌లో ఎంఈవో కార్యాలయ ఏర్పాటుపై ప్రతిపాదించిన ఎమ్మెల్యే ముస్తఫా
- ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా పట్టించుకోని ఆర్జేడీ, డీఈవోలు



గుంటూరు అర్బన్ ఎంఈవో కార్యాలయం

గుంటూరు ఎడ్యుకేషన్: తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలో ఎంఈవో కార్యాలయ విభజనపై విద్యాశాఖాధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. గుంటూరు అర్బన్, రూరల్ కలుపుకుని ఉమ్మడిగా ఉన్న కార్యాలయాన్ని పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం ఈస్ట్, వెస్ట్‌గా విభజించి ఏడాది గడిచిపోయింది. ఉమ్మడి గుంటూరు జిల్లా కేంద్రమైన గుంటూరు నగర, రూరల్ పరిధిలో 505 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలున్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులకు వేతనాల బిల్లులు మంజూరు, సర్వీసు విషయాల్ని ఎంఈవోలే పర్యవేక్షిస్తున్నారు. అయితే, గతంలో అర్బన్, రూరల్ కలుపుకుని ఒక్క ఎంఈవోనే మొత్తం వ్యవహారాలు పర్యవేక్షించిన పరిస్థితి ఉండేది. పని భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రతి మండలానికి కొత్తగా ఎంఈవో–2 పోస్టును మంజూరు చేసింది. దీంతో గుంటూరు ఈస్ట్, వెస్ట్‌లలో ఎంఈవో పోస్టులు నాలుగుకు చేరాయి. ప్రభుత్వం సృష్టించిన రెండో ఎంఈవో పోస్టుల ద్వారా మండల విద్యాశాఖాధికారులకు ఉపశమనం కలిగింది.

విధుల నిర్వహణకు ఇబ్బందులు

గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకర్గాలతో పాటు ప్రత్తిపాడు పరిధిలోకి వచ్చే రూరల్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గుంటూరు సైతం ఈస్ట్, వెస్ట్ పరిధిలోకి వస్తున్నాయి. నలుగురు ఎంఈవోలు జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వర్తిస్తున్నారు. భౌగోళికంగా ప్రస్తుతం కలెక్టర్ బంగ్లా రోడ్డులో ఉన్న ఎంఈవో కార్యాలయంలో వెస్ట్ పరిధిలోకి వస్తుంది. కాగా నలుగురు ఎంఈవోలకు ఒకే కార్యాలయం ఉండటంతో విధుల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకే గదిలో నాలుగు కుర్చీలు వేసుకుని విధులు నిర్వర్తిస్తున్నారు.

తూర్పులో కార్యాలయం ఏర్పాటు అవశ్యం

గుంటూరు నగరంలో 205 ప్రభుత్వ పాఠశాలలతో పాటు మరో 300 ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన వ్యవహారాల్ని పర్యవేక్షించే బాధ్యతలు ఒక్క ఎంఈవో కార్యాలయం నుంచే జరుగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న విద్యాకానుక కిట్లను పాఠశాలలకు పంపి, విద్యార్థులకు పంపిణీ చేయడం, పాఠ్య పుస్తకాల్ని సకాలంలో సరఫరా చేయడంతో పాటు ప్రభుత్వ నిబంధనల్ని ప్రైవేటు పాఠశాలలు కచ్చితంగా అమలు చేస్తున్నదీ, లేనిదీ పర్యవేక్షించే విధుల్ని ఎంఈవోలు నిర్వహించాల్సి ఉంది. జిల్లా కేంద్రం కావడంతో పాటు పెద్ద సంఖ్యలో పాఠశాలలు ఉండటంతో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కొత్తగా ఎంఈవో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. పరిపాలనా సౌలభ్యం కోసం తూర్పులో నూతనంగా ఎంఈవో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణతో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి సైతం తీసుకెళ్లారు. దీంతో పాటు ఆర్జేడీ వి.ఎస్. సుబ్బారావు, డీఈవో పి. శైలజకు సూచించారు. అయినప్పటికీ విద్యాశాఖాధికారుల్లో చలనం లేకపోవడంతో సమస్య ఎదురవుతోంది.

గ్రామీణులకు స్పెషలిస్టు వైద్యసేవలు

తుమ్మలపాలెం (ప్రత్తిపాడు): జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామీణులకు వారి గ్రామాల్లోనే స్పెషలిస్టులతో వైద్యసేవలు అందించినట్లు గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కెజియాగ్రేస్ తెలిపారు. మండలంలోని తుమ్మలపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ చల్లా నాగమల్లేశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు మేరుగ సుభాషిణి ప్రారంభించారు. శిబిరానికి 424 మంది రోగులు హాజరయ్యారు. వీరికి డాక్టర్ కెజియాగ్రేస్, డాక్టర్ దివ్యమేఘన, గైనకాలజిస్ట్ డాక్టర్ అంజనీదేవి, పీడియాట్రీషియన్ డాక్టర్ ముఖేష్‌కుమార్, నేత్ర వైద్యనిపుణుడు డాక్టర్ సయ్యద్ వైద్య పరీక్షలు నిర్వహించారు. తీవ్ర అనారోగ్య సమస్యలున్న 16మందిని మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. మిగిలిన వారికి రక్తపరీక్షలు చేసి, మాత్రల్ని పంపిణీ చేశారు. మండలంలో శిబిరాలు ముగియడంతో ఉత్తమ సేవలు అందించిన స్పెషలిస్టు వైద్యుల్ని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ వేలూరి లక్ష్మారెడ్డి, మండల పరిషత్ కార్యాలయం ఏవో రామకోటయ్య, ఎంపీహెచ్ఈవో చెల్లమ్మ, సీహెచ్‌వో స్వర్ణలత, పీహెచ్ఎన్ నిర్మలాదేవి, హెచ్‌వీలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొన్నూరులో...

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరమని ఎంపీపీ బి.పద్మలీల పేర్కొన్నారు. మండలంలోని ములుకుదురు ఎంపీయూపీ పాఠశాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఎంపీపీ పద్మలీల, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ కేదార్‌నాథ్ శ్రీకాంత్, సర్పంచ్ కందుల దుర్గాదేవి, ఎంపీటీసీ సభ్యురాలు కందుల సరోజిని సందర్శించారు. ప్రజలకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించడంతో పాటు ఇంటి వద్దనే వైద్య సేవలు అందిస్తోందని తెలిపారు. ఎంపీటీసీ సభ్యురాలు కందుల సరోజిని మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మన రాష్ట్రంలో సీఎం జగన్ సంక్షేమ పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. శిబిరంలో 477 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. చికిత్స అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యశాలలో మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు, నాయకులు కందుల వెంకట సుబ్బారావు, కందుల వెంకటేశ్వరరావు, రఘురామ విద్యాసాగర్, దాసరి శివరామకృష్ణ, శ్రీ చెన్నకేశవ స్వామి, ఆలయ చైర్మన్ కందుల వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



ములుకుదురులో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మలీల

కాకుమానులో..

రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు పేదల ఆరోగ్యానికి భరోసాగా నిలిచాయని జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం తెలిపారు. కాకుమానులోని నన్నపనేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా గుల్జార్ బేగం మాట్లాడుతూ ప్రస్తుతం పేదవాడికి అందని ద్రాక్షలా ఉన్న కార్పొరేట్ వైద్యాన్ని గ్రామీణ ప్రాంతాల్లోనే అందించి దేశ చరిత్రలో ఏకైక నాయకుడిగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ఆమె కొనియాడారు. ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్యం అందక ఏ ఒక్క పేద కుటుంబం ఇబ్బందులు పడకూడదనే మంచి సంకల్పంతో గ్రామాలలో అనుభవజ్ఞులైన వైద్యులతో శిబిరాలు నిర్వహించి లక్షలాది కుటుంబాలలో వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని వివరించారు. అనంతరం వైద్యులు పలువురికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివకుమారి, ఎంపీటీసీ సభ్యుడు కానుగుల పరమేశ్వరరావు. సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ముజావర్ షేక్ అసదుల్లా, మండల ఉపాధ్యక్షులు పెదపూడి కపిల్, తియ్యగూర వెంకటరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పి.శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారిణి తేళ్ల ప్రేమ కుమారి, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎంపీడీవో రామకృష్ణ, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



తుమ్మలపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్ అందజేస్తున్న వైద్యాధికారి డాక్టర్ కెజియాగ్రేస్



కాకుమానులో వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

విద్యార్థుల జాతీయ ఐక్యతా ప్రదర్శన

గుంటూరు ఎడ్యుకేషన్: సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) గుంటూరు ఫీల్డ్ ఆఫీస్ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా సోమవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. జేకేసీ కళాశాల నుంచి విద్యార్థులతో ఏర్పాటు చేసిన ర్యాలీని ప్రిన్సిపాల్ ఐ.నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఐక్యత ప్రాముఖ్యత వివరించేందుకు దేశవ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమాల్లో తమ కళాశాల విద్యార్థులు సైతం పాల్గొంటున్నారన్నారు. మన దేశ సంస్కృతిలోనే ఐక్యత ఇమిడి ఉందని తెలిపారు. సీబీసీ గుంటూరు అధికారి ఆర్.రమేష్ చంద్ర మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం వివిధ సంస్థానాలను ప్రస్తుత ప్రజాస్వామిక దేశంగా ఏకతాటిపైకి తీసుకురావడంలో ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సాహసోపేతంగా వ్యవహరించారని తెలిపారు. ఆయన జయంతి రోజైన అక్టోబర్ 31ని దేశవ్యాప్తంగా జాతీయ ఐక్యతా దినంగా జరుపుకుంటున్నట్లు వివరించారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. నా దేశం–నామట్టి కార్యక్రమంలో భాగంగా రెండు నెలలుగా రాష్ట్రంలో వివిధ పంచాయతీల నుంచి సేకరించిన పదివేలకు పైగా అమృత కలశాలు మంగళవారం దేశ రాజధాని ఢిల్లీలోని అమృతవాటికలో ఐక్యం కానున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు ఆయన వివరించారు. ర్యాలీలో జేకేసీ కళాశాల ఎన్ఎస్ఎస్ కేడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు, రమేష్ చంద్ర

స్పందన ఫిర్యాదులను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలి

ఇంచార్జి కమిషనర్ భాస్కర్

నెహ్రూనగర్: ప్రజల నుంచి స్పందనలో అందే ఫిర్యాదుల్ని ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని నగర ఇంచార్జి కమిషనర్ పి.వి.కె. భాస్కర్ తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో సోమవారం స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదుల్ని బాధ్యతతో పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని ఆదేశించారు. సమస్య పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని చెప్పారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలని సూచించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 24 ఫిర్యాదులు అందాయన్నారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి– 9, ఇంజినీరింగ్ విభాగానికి– 7, రెవెన్యూ విభాగానికి– 6, ప్రజారోగ్య విభాగానికి– 2 చొప్పున ఉన్నాయని ఆయన వివరించారు. ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ఇంచార్జి) సీహెచ్.శ్రీనివాస్, డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ భాస్కర్

విజ్ఞాన్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు పీహెచ్‌డీ

చేబ్రోలు: మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ దేవకుమార్ సల్లూరి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఆయన డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఏ నోవెల్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ సివియారిటీ ప్రెడిక్షన్ ఆఫ్ డయాబెటిక్ రెటినోపతీ అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించారు. యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ పట్టాను అందజేసి, అభినందించారు. డీన్లు, అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



దేవకుమార్‌ను అభినందిస్తున్న వీసీ నాగభూషణ్

ఆయుర్వేద వైద్య సేవలు అభినందనీయం

పెదకాకాని: శివాలయంలో భక్తులకు ఆయుర్వేద వైద్య సేవలు అందించడం అభినందనీయమని ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం విజయవాడ ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆలయానికి వచ్చిన భక్తులతో పాటు స్థానికులకు వైద్యులు డాక్టర్ పి. కన్నన్, డాక్టర్ సురేష్, డాక్టర్ వేముల భానుప్రకాష్, డాక్టర్ కె.ఖాదర్ మొహిద్దీన్ ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.



గ్రావెల్ లారీలతో భూమి ధ్వంసంపై ఫిర్యాదు

చేబ్రోలు: మండలంలోని వీరనాయకునిపాలెంలో గ్రావెల్ లారీలు ఇష్టానుసారంగా రాకపోకలతో భూమి ధ్వంసం అవుతుండటంతో న్యాయం చేయాలని సోమవారం జిల్లా ఉన్నతాధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. వీరనాయకునిపాలేనికి చెందిన మాలటి సరస్వతికి ప్రభుత్వం డీకే పట్టాను అందించింది. సమీప ప్రాంతంలో క్వారీని తవ్వకొని, గ్రావెల్ లారీలు రాత్రి సమయంలో తమ భూమిలో రాకపోకలు సాగించడం ధ్వంసం అవుతోందని ఆమె జిల్లా ఎస్పీ, కలెక్టర్‌కు ఆమె ఫిర్యాదు చేసింది. లారీలను నిలుపదల చేసి, రావద్దని చెప్పినందుకు క్వారీ యజమానులు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పేర్కొంది. తనకు న్యాయం చేసి తమకు, భూములకు రక్షణ కల్పించాలని సరస్వతి విజ్ఞప్తి చేసింది.

తూకంలో తేడాలపై అప్రమత్తంగా ఉండాలి

నెహ్రూనగర్: తూకంలో (కాటా) తేడాల్ని ప్రతి ఒక్కరూ గమనించాలని లీగల్ మెట్రాలజీ డెప్యూటీ కంట్రోలర్ షాలెం రాజు సూచించారు. చుట్టుగుంట రైతు బజార్‌లో సోమవారం ధర్మ కాటా ఏర్పాటు చేసి, తూకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షాలెం రాజు మాట్లాడుతూ కొనుగోలుదారులంతా తూకాలపై అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. తేడా ఉన్నట్టు గ్రహించినట్లయితే ధర్మ కాటా ద్వారా తెలుసుకోవాలని సూచించారు.

నిత్య వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పెదకాకాని: విద్యార్థులు నిత్య వ్యాయామంతో పాటు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఆస్టర్ రమేష్ డెప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాయపాటి మమత తెలిపారు. ప్రపంచ స్ట్రోక్ డేను పురస్కరించుకుని 'మేము స్ట్రోక్ కంటే స్ట్రాంగ్‌గా ఉంటాం' అనే నినాదంతో మండలంలోని నంబూరు వీవీఐటీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ రాయపాటి మమతతో పాటు న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్. కుమారవేలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. డాక్టర్ మమత మాట్లాడుతూ విద్యార్థులంతా ఆరోగ్యంపై దృష్టి సారించినప్పుడే సులభంగా చదవగలుగుతారని సూచించారు. జంక్ ఫుడ్ అనారోగ్యానికి గురిచేసే ప్రమాదం ఉందని తెలిపారు. డాక్టర్ ఎస్. కుమారవేలు మాట్లాడుతూ గుండె, మెదడుకు రక్తం సరఫరా పూర్తిగా అందకపోవడం వల్ల స్ట్రోక్స్ సంభవిస్తాయని చెప్పారు. స్ట్రోక్స్ అన్ని వయస్సుల వారికి సంభవించవచ్చని, వాటి లక్షణాలపై అవగాహన కలిగి ఉండాలని ఆయన తెలిపారు. ధూమపానం వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. బలహీనత, తీవ్రమైన తలనొప్పి, ఆకస్మిక తిమ్మిరి, దృష్టి సమస్యలు, మైకం, నడకలో ఇబ్బంది వంటి లక్షణాలు గమనించిన వెంటనే వైద్యుల్ని సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ కె. గిరిబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఐఎస్‌జే భక్తసింగ్, రమేష్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



నంబూరు వీవీఐటీలో విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ మమత

పోషకాహారంతోనే ఆరోగ్య పరిరక్షణ

కాకుమాను: పోషకాహారంతోనే ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు తెలిపారు. కాకుమానులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార శిబిరాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య దశ నుంచే చిన్నారులు మంచి ఆరోగ్యంతో ఉండాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు చిన్నారులకు అందించే ఆహారంలో అనేక మార్పులు తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు మంచి పోషక విలువలు కలిగిన పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన పోషకాహార పదార్థాల్ని ఆయన రుచి చూశారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, సర్పంచ్ శివకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు పరమేశ్వరరావు, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఐసీడీఎస్ కాకుమాను సెక్టార్ సూపర్‌వైజర్ కుమారి పాల్గొన్నారు.



పోషకాహారాన్ని రుచి చూస్తున్న ప్రజా ప్రతినిధులు,అధికారులు

మెషీన్ లెర్నింగ్ ఆల్గరిథమ్స్– అప్లికేషన్స్ పుస్తకావిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ సైన్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగ అధ్యాపకులు డాక్టర్ ఆర్. వసంత, డాక్టర్ జి. నీలిమ రాసిన మెషీన్ లెర్నింగ్ అల్గరిథమ్స్ – అప్లికేషన్స్ పాఠ్య పుస్తకాన్ని సోమవారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెషీన్ లెర్నింగ్ అనేది ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌లో ఒక ముఖ్య భాగమని పేర్కొన్నారు. దీన్ని సెల్ఫ్ డ్రైవింగ్ కార్స్, మెడికల్ డయాగ్నోస్టిక్స్, డ్రోన్స్, జీపీఎస్ వంటి వాటిలో ఉపయోగిస్తున్నారని వివరిరించారు. పాఠ్య పుస్తకంలో మెషీన్ లెర్నింగ్ అల్గోరిథమ్స్‌ను విశదీకరించామని రచయితలు తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. గంగాధరరావు, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి. నాగరాజు, డాక్టర్ బి.బసవేశ్వరరావు, డాక్టర్ కె. లావణ్య, డాక్టర్ సూర్యకామేశ్వరి, పుష్పలత పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, ప్రిన్సిపాల్ గంగాధరరావు తదితరులు

టుబాకో కంపెనీలో వ్యక్తి ఆత్మహత్య

చినకోండ్రుపాడు (ప్రత్తిపాడు): అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు నగరం నందమూరికాలనీ ఒకటవ లైనుకి చెందిన మల్లెం వీరాంజనేయులు (55)కు కొద్ది సంవత్సరాల కిందట అనారోగ్య కారణాల వల్ల చేతిని తొలగించారు. దీంతో కొంతకాలంగా ప్రత్తిపాడు మండలం, చినకొండ్రుపాడులోని పోలిశెట్టి సుందరం టుబాకో కంపెనీలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇంటి అవసరాల నిమిత్తం కొన్నేళ్ల కిందట రూ. 5 లక్షల రూపాయలు అప్పులు చేశాడు. ఆ అప్పు ఎలా తీర్చాలా అని కొద్ది రోజులుగా బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం తాను పనిచేసే కంపెనీ గోడౌన్‌లో ఉరి వేసుకున్నాడు. గమనించిన తోటి కూలీలు హుటాహుటిన గుంటూరు జీజీహెచ్‌కు తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై ఎస్‌ఐ డి. రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.



వీరాంజనేయులు (ఫైల్)